కొండపాక పీహెచ్‌సీని సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా వైద్యాధికారి పుట్ట శ్రీనివాస్

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వద్దు

కొండపాక, మార్చి 28: రోగులకు వైద్యం అందించడంలో సమయపాలన పాటిస్తూ మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వైద్యాధికారి పుట్ట శ్రీనివాస్ అన్నారు. గురువారం కొండపాక పీహెచ్‌సీని ఆయన సందర్శించారు. దవాఖానలోని రికార్డులను, ఫార్మసీని, వైద్య సేవలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలందించడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, వైద్యాధికారి శ్రీధర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

హుస్నాబాద్‌టౌన్, మార్చి 28: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాస్ సూచించారు. హుస్నాబాద్ ప్రభుత్వ దవాఖానను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా డయాలసిస్ రోగులతో ప్రత్యేకంగా మాట్లాడారు. వారికి అందుతున్న ఆరోగ్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి నాణ్యమైన సేవలు అందించేందుకు కృషి చేయాలని ఇన్‌చార్జి వైద్యులకు సూచించారు. అనంతరం ఆస్పత్రి రికార్డులను పరిశీలించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

ఈడీపీతో బహుళ ప్రయోజనాలు

ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్‌పై అవగాహన కల్పిస్తున్న కళాశాల డీన్ ఆశ

ములుగు, మార్చి 28: ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఈడీపీ)తో విద్యార్థులు బహుళ ప్రయోజనాలు పొందవచ్చని అటవీ కళాశాల పరిశోధన కేంద్రం డీన్ ఆశ అన్నారు. మండల కేంద్రం ములుగులోని అటవీ కళాశాల పరిశోధన కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఈడీపీ ముఖ్య ఉద్దేశం గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అటవీ సంబంధిత పారిశ్రామిక రంగాల్లో విజయవంతమైన వ్యవస్థాపకులుగా మారడానికి విద్యార్థులకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ డైరెక్టర్ మమత, కళాశాల డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు చేయూత

వృద్ధులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న వాసవీ వనిత క్లబ్ సభ్యులు

సిద్దిపేట టౌన్, మార్చి 28: వృద్ధులకు సాయం చేయడానికి అందరూ ముందుకు రావాలని సిద్దిపేట వాసవీ వనిత క్లబ్ అధ్యక్షురాలు వాణి పిలుపునిచ్చారు. దుర్గయ్య దంపతుల సహకారంతో సిద్దిపేట భారత్‌నగర్‌లోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాణి మాట్లాడుతూ.. వృద్ధులకు సేవ చేయడం సంతోషంగా ఉన్నదన్నారు. కార్యక్రమంలో వీరేశం, స్వరూపారాణి, అంతయ్య ఉన్నారు.

ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించాలి

హుస్నాబాద్‌టౌన్, మార్చి 28: ప్రతి ఇంటి నుంచి తప్పనిసరిగా చెత్తను సేకరించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో చెత్తను సేకరించే ఆటోడ్రైవర్లు, హెల్పర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంట్లోనే తడి, పొడిచెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనాలకు అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. లాగ్‌బుక్స్ తప్పనిసరిగా రాయాలన్నారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని, చెత్తను రహదారులపై వేయకుండా చూడాలని సూచించారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రవికుమార్, జవాన్ ప్రభాకర్ పాల్గొన్నారు.

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి

అక్కన్నపేట, మార్చి 28: లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్ అన్నారు. అక్కన్నపేట పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి మండలంలోని రామవరంలో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. శాంతిభద్రతలకు సహకరించాలని కోరారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అక్కన్నపేట ఎస్‌ఐ వివేక్, రామవరం ఎంపీటీసీ లింగాల శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతియుత వాతావరణంలో ఎన్నికలు

- **సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ**

చేర్యాలలో పోలీస్‌ల పనితీరును పరిశీలిస్తున్న సీపీ అనురాధ

చేర్యాల, మార్చి 28: శాంతియుత వాతావరణంలో నిష్పక్షపాతంగా లోక్‌సభ ఎన్నికలను నిర్వహించేందుకు పోలీస్ శాఖ కృషి చేస్తున్నట్లు సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ అన్నారు. గురువారం చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి పోలీస్ స్టేషన్లను సీపీ సందర్శించి, రికార్డులు పరిశీలించారు. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పోలింగ్ కేంద్రాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వీపీవోలు గ్రామాలకు సంబంధించిన సమాచారాన్ని రికార్డుల రూపంలో భద్రపర్చాలన్నారు. గ్రామాల్లో వీపీవోలు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను తీర్చడానికి కృషి చేయాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాల సరఫరాపై నిఘా పెట్టాలన్నారు. ఎన్నికల సమయంలో గొడవలు పడే వ్యక్తులను గుర్తించి, వారి కదలికలపై నిఘా పెట్టాలని సూచించారు. ఎన్నికల వేళ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేవిధంగా ఎవరైనా పాల్పడితే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. ఓటర్లను ప్రలోభపర్చే విధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోన్నుట్లు తెలిపారు. కార్యక్రమంలో హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, చేర్యాల సీఐ ఎల్.శ్రీను, ఎస్‌ఐలు దామోదర్, షేక్ యూనుస్‌అహ్మద్, నాగరాజు తదితరులు ఉన్నారు.

సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలి

నంగునూరు, మార్చి 28: పంట పొలాలకు సాగునీరు అందించి ఎండిపోకుండా చూడాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రమైన నంగునూరులో కార్యకర్తల సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడారు. నంగునూరు మండలంలో సాగునీరు లేక పంటలు ఎండుతూ రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తక్షణమే స్పందించి పంట పొలాలు ఎండిపోకుండా సాగునీరు అందించి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చౌడుచర్ల వెంకటరాంరెడ్డి తదితరులు ఉన్నారు.

ఉచితంగా సేంద్రియ ఎరువులు పంపిణీ

మర్కూక్‌లో ఉచితంగా ఎరువులు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

మర్కూక్, మార్చి 28: మండలంలోని నూజివీడు సంస్థ ఆధ్వర్యంలో బయోచార్ ఎరువులను రైతులకు ఉచితంగా అందజేశారు. బయోచార్ నేల స్వాభావాన్ని మెరుగుపరచడమే కాకుండా ఆరోగ్యవంతమైన విత్తనాన్ని ఎదిగేలా చేస్తుందని, నేలలో నీటిని నిల్వచేస్తుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. పోషకాలను పెంచేందుకు ప్రతీ రైతు బయోచార్‌ను వాడాలని తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు ఉచితంగా 200 మెట్రిక్ టన్నుల సేంద్రియ బయోచార్ ఎరువులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఏవో నాగేందర్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు ప్రవీన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఏఈవో రజనీకాంత్, విష్ణువర్ధన్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా 'బుట్టి'

చేర్యాల, మార్చి 28: మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చేర్యాల పట్టణానికి చెందిన బుట్టి సత్యనారాయణను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో సత్యనారాయణకు నియామకపత్రాన్ని అందజేశారు. మాల మహానాడు సంఘం అభివృద్ధికి, అంబేద్కర్, పూలే భావజాలాన్ని వ్యాప్తి చేసేందుకు సత్యనారాయణ విశేషంగా కృషి చేసినట్లు తెలిపారు. జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్ సూచన మేరకు జాతీయ ప్రధాన కార్యదర్శి బైరి రమేశ్, జాతీయ, రాష్ట్ర కమిటీల సమక్షంలో సత్యనారాయణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన సంఘం పెద్దలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నట్లు బుట్టి సత్యనారాయణ తెలిపారు.

చేనేత విగ్రహావిష్కరణ

గజ్వేల్, మార్చి 28: ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని వేములఘట్ గ్రామంలో చేనేత విగ్రహాన్ని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కస్తూరి సతీశ్ మాట్లాడుతూ వ్యవసాయం తర్వాత చేనేత వృత్తికే విశేష ప్రాధాన్యం ఉందన్నారు. చేనేత విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉన్నదన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ సంఘం అధ్యక్షుడు దుర్గాప్రసాద్, వేములఘట్ ఉపసర్పంచ్ బాలకిషన్ పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్‌ల వద్ద ముమ్మర తనిఖీలు

జగదేవ్‌పూర్ చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి

జగదేవ్‌పూర్, మార్చి 28: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దు చెక్‌పోస్ట్‌ల వద్ద ముమ్మర తనిఖీలు చేపడుతున్నట్లు రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన సరిహద్దు చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా ఎవరైనా మద్యం, డబ్బు, ఎన్నికలను ప్రభావితం చేసే చర్యలు చేపట్టేవారిపై పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మద్యం, డబ్బు అక్రమ మార్గంలో సరఫరా కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనుమానాస్పదంగా ఎవరు కనిపించినా సోదా చేయాలని ఆదేశించారు.

కొండపాక ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం

మాట్లాడుతున్న గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్

కొండపాక, మార్చి 28: కొండపాక ఎంపీపీ ర్యాగళ్ల సుగుణపై అవిశ్వాస తీర్మానం నెగ్గింది. పాలనలో సమన్యాయం పాటించడం లేదని, నిధుల మంజూరులో పక్షపాతం చూపుతున్నారని తొమ్మిది మంది ఎంపీటీసీ సభ్యులు ఇటీవల ఆర్డీవో బన్సీలాల్‌కు ఫిర్యాదు చేశారు. గురువారం ఆర్డీవో బన్సీలాల్ సమక్షంలో అవిశ్వాస పరీక్ష నిర్వహించగా మొత్తం 14మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా చింతల సాయిబాబాగౌడ్, మంజూల అనసూయ, పత్తి ఆంజనేయులు, గురజాడ బాలాజీ, పిల్లి శిరీష, ఆరుట్ల లక్ష్మి, విరూపాక ప్రణీత, యాదగిరి, శ్రీనివాస్‌లు తొమ్మిది మంది హాజరై ఎంపీపీకి వ్యతిరేకంగా ఓటేశారు. అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీవో బన్సీలాల్ ప్రకటించారు. కొత్త ఎంపీపీ ఎంపిక తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు. శనివారం వైస్ ఎంపీపీపై అవిశ్వాస పరీక్ష ఉంటుందని తెలిపారు. అవిశ్వాస పరీక్ష తర్వాత బీఆర్ఎస్‌కు చెందిన ఎంపీటీసీ మంచాల అనసూయ, పార్టీ మండల అధ్యక్షుడు వాసరీ లింగారావు, విరూపాక శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరడం గమనార్హం. ఈ సందర్భంగా ఎంపీటీసీ అనసూయ మాట్లాడుతూ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడంతో కాంగ్రెస్ పార్టీలో చేరానన్నారు. అనంతరం ఎంపీటీసీ మంచాల అనసూయ డీసీసీ నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

తిరుమల థియేటర్‌కు తాళం



తిరుమల థియేటర్‌కు తాళం వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

గజ్వేల్, మార్చి 28: గజ్వేల్ పట్టణంలోని తిరుమల థియేటర్ ఆస్తి పన్ను బకాయి ఉన్నందున మున్సిపల్ కమిషనర్ నరసయ్య ఆదేశానుసారం గురువారం థియేటర్‌కు మున్సిపల్ సిబ్బంది తాళం వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ నరసయ్య మాట్లాడుతూ అత్యధికంగా పన్నులున్న ప్రైవేటు పాఠశాలలు, కాలేజీలు, ఫంక్షన్‌హాళ్లు, పెట్రోల్ బంక్‌లు, షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్ల నిర్వాహకులు బకాయిలను ఈనెల 31లోగా చెల్లించాలన్నారు. పట్టణ వాసులు సకాలంలో ఇంటి పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు: డీఈ

అక్కన్నపేట, మార్చి 28: వేసవి నేపథ్యంలో మండలంలో నీటి ఎద్దడిని నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు మిషన్ భగీరథ డీఈ రుహీనాతస్కీన్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని చాపగానితండా, కట్కూరు, మోత్కులపల్లి, మల్లంపల్లి గ్రామాల్లోని మంచినీటి బావులను, వాటర్ ట్యాంకులను, మిషన్ భగీరథ నీటి సరఫరాను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నెలకొన్న నీటి సమస్య గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఈ మౌనిక, ఎంపీవో కవికుమార్, ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

చెలిమి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం

గజ్వేల్, మార్చి 28: మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో చెలిమి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన సల్లస్వామి కుటుంబ సభ్యులకు గురువారం ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులకు నిత్యావసర సరుకులు, రూ.11,500 నగదు అందజేశారు. కార్యక్రమంలో తులసీదాస్, ఆనంద్, గుంటుక శ్రీనివాస్, అంజనేయులు, రమేశ్, నర్సింలు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ, ప్రింటర్ అందజేత

నంగునూరు, మార్చి 28: మండల పరిధిలోని బద్దిపడగ ప్రాథమిక పాఠశాలకు గురువారం బెస్ట్ రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 55 ఇంచుల కలర్ టీవీ, ప్రింటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో దేశిరెడ్డి మాట్లాడుతూ.. బెస్ట్ రన్నర్స్ అసోసియేషన్ చేస్తున్న సామాజిక సేవలు అభినందనీయమని.. ప్రతి ఒక్కరూ సమాజానికి తనవంతుగా సేవ చేయాలన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ ప్రభాకర్‌రావు, ప్రధానోపాధ్యాయురాలు లలిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నంగునూరులో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

నంగునూరులో ఫ్లాగ్ మార్చ్

నంగునూరు, మార్చి 28: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మండల కేంద్రమైన నంగునూరులో కేంద్ర బలగాలతో కలిసి సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఇన్సిడెంట్ ఫ్రీగా ఎన్నికలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఓటు హక్కు ఉన్న ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదన్నారు. ఎన్నికలకు సంబంధించి ఏదైనా ఫిర్యాదు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1950 కాల్ చేయాలని సూచించారు. సీ విజిల్ యాప్‌లో కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో చిన్నకోడూర్, సిద్దిపేటరూరల్ ఎస్‌ఐలు బాల కృష్ణ, అపూర్వరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం

దుబ్బాక, మార్చి 28: ప్రజాస్వామ్య దేశంలో ప్రజలకు ఓటే వజ్రాయుధమని దుబ్బాక సీఐ శ్రీనివాస్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా గురువారం దుబ్బాక, మిరుదొడ్డి, భూంపల్లి ఎస్‌ఐలు, కేంద్ర బలగాలతో కలిసి దుబ్బాక పట్టణంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా దుబ్బాక సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇన్సిడెంట్ ఫ్రీ ఎన్నికలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదు చేయడానికి టోల్ ఫ్రీ 1950 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో దుబ్బాక మిరుదొడ్డి, భూంపల్లి ఎస్ఐలు గంగరాజ్, పర్శరాములు, రవికాంత్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోవిందాపూర్‌లో వరుస చోరీలు

ఓ ఇంట్లో చిందర వందరగా ఉన్న బట్టలు

వర్గల్, మార్చి 28: ఒకటికాదు, రెండుకాదు.. దొంగల ముఠా ఇండ్లల్లో అందినకాడికి దోచుకెళ్లింది. మట్టెలు, కడియాలు, చెవుల కమ్మలు, పెట్టెలో దొరికిన నగదును ఎత్తుకెళ్లారు. తాళాలు వేసిన ఇండ్లే లక్ష్యంగా చేసుకొని అర్ధరాత్రి ఐదు ఇండ్లలో వరుస బెట్టి అందినకాడికి దోచుకున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గోవిందాపూర్‌లో బుధవారం అర్ధరాత్రి 2గంటల ప్రాంతంలో లింగ బాలమణి ఇంట్లో తులంన్నర బంగారం గుండ్లు, 62 తులాల వెండి కడియాలు, రూ8 వేల నగదు, కీసర రాములమ్మ ఇంట్లో 3 జతల పట్టగొలుసులు, చిన్న మాటీలు, ఒకటి చెక్కుడు గుత్తి, రూ. 8వేల నగదు, యావపురం రవీందర్ ఇంట్లో 7 ఉంగరాలు, 20 తులాల పట్టగొలుసులు, బుడిగె యాదగిరి, బుచ్చిలింగం ఇండ్లలో చోరీ జరిగినట్టు తెలిపారు.

ఉత్కంఠగా బార్ అసోసియేషన్ ఎన్నికలు

- **సిద్దిపేట అధ్యక్షుడిగా జనార్దన్‌రెడ్డి**

సిద్దిపేట: జనార్దన్‌రెడ్డి

గజ్వేల్: పండరి

హుస్నాబాద్‌టౌన్: మురళీమోహన్

సిద్దిపేట టౌన్, మార్చి 28: బార్ అసోసియేషన్ ఎన్నికలు జిల్లా కేంద్రం సిద్దిపేటలో గురువారం రసవత్తరంగా జరిగాయి. సిద్దిపేట బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవి కోసం పూర్వ అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, దేవునూరి రవీందర్ పోటీలో నిలిచారు. అధ్యక్ష ఎన్నిక మొదటి నుంచి హోరాహోరీగా సాగింది. ఉత్కంఠగా సాగిన పోటీలో సమీప అభ్యర్థి రవీందర్‌పై జనార్దన్‌రెడ్డి ఒక్క ఓటు తేడాతో గెలుపొందడం విశేషం. బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఎన్నికలో పవన్‌కుమార్, మంతూరి సత్యనారాయణ పోటీపడ్డారు. ఈ పోటీలో పవన్‌కు 75 ఓట్లు రాగా సత్యనారాయణకు 96 వచ్చాయి. సమీప అభ్యర్థి పవన్‌పై 21 ఓట్ల తేడాతో సత్యనారాయణ గెలిచారు. కాగా, జనార్దన్‌రెడ్డి మూడోసారి బార్ అసోసియోషన్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా బాబురావు, శివాజీ గణేశ్, శ్రీనివాస్ వ్యవహరించారు.

గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పండరి

గజ్వేల్, మార్చి 28: గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పండరి ఎన్నికయ్యారు. గురువారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్ష పదవి కోసం పోటీలో సీహెచ్.పండరి, మాజీ అధ్యక్షుడు హరికృష్ణ, భాజా మిస్కిన్‌లున్నారు. అధ్యక్ష ఎన్నికల్లో 53ఓట్లు పోలింగ్ కాగా అందులో పండరికి 42 రావడంతో అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ప్రకటించారు. 2024-25 సంవత్సరానికి జరిగిన ఎన్నికల్లో మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామానికి చెందిన యువ న్యాయవాది పండరి ఎన్నిక కావడం పట్ల సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

హుస్నాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మురళీమోహన్

హుస్నాబాద్‌టౌన్, మార్చి 28: హుస్నాబాద్ బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికలు గురువారం హుస్నాబాద్‌లో జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికల్లో బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా విలాసాగరం మురళీమోహన్ గెలుపొందారు. అధ్యక్ష పదవికి పోటీచేసిన మురళీమోహన్‌కు 19 ఓట్లు రాగా, చిత్తారి రవీందర్‌కు 9 ఓట్లు, పిట్టల దేవదాస్‌కు 4 ఓట్లు, కొత్తపల్లి దేవేందర్‌కు 3 ఓట్లు వచ్చాయని ఎన్నికల అధికారి జాల జ్యోతికుమార్ తెలిపారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా కన్నోజు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా గుగులోతు జుమ్‌లాల్, సహాయ కార్యదర్శిగా జెరిపోతుల రవీందర్, జూనియర్ కార్యవర్గ సభ్యుడిగా దీకొండ ప్రవీణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు మురళీమోహన్ తెలిపారు. అనంతరం మర్యాదపూర్వకంగా జూనియర్ సివిల్ జడ్జి శివరంజనిని నూతన కార్యవర్గం కలవగా వారికి శుభాకాంక్షలు తెలిపారు.

పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), మార్చి 28: అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఖాజీపూర్‌లోని శ్రీలక్ష్మీ నర్సింహా రైస్ మిల్ ఆవరణలో గురువారం నూతనంగా ప్రతిష్ఠించిన మైసమ్మ దేవి ఆలయ ఉత్సవాల్లో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అక్బర్‌పేట-భూంపల్లి మండల అధ్యక్షుడు రవి, మిరుదొడ్డి మాజీ ఎంపీపీ పంజాల కవితాశ్రీనివాస్‌గౌడ్, మోహన్‌రెడ్డి, రాజిరెడ్డి పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

దుబ్బాక, మార్చి 28: లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ మెదక్ లోక్‌సభ ఎంపీ అభ్యర్థి వెంకట్‌రామిరెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దుబ్బాక పట్టణంలోని కోమటిరెడ్డి రజనీకాంత్ రెడ్డి ఫంక్షన్ హాలులో దుబ్బాక నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నామని గురువారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు దుబ్బాక నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డితోపాటు ముఖ్య నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తాం

మిరుదొడ్డి(అక్బర్‌పేట-భూంపల్లి), మార్చి 28: మెదక్ లోక్‌సభ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిస్తామని బీఆర్ఎస్ అక్బర్‌పేట-భూంపల్లి మండల అధ్యక్షుడు జీడిపల్లి రవి అన్నారు. గురువారం అక్బర్‌పేటలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ బీఆర్ఎస్ కంచుకోటలో మరోసారి గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం దుబ్బాకలో జరిగే నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి మండలంలోని ఆయా బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నర్సింహులు

రాయపోల్, మార్చి 28: ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన పుర్ర నర్సిం